# పలుకుబడి

బంజారా కొండల మీదినుంచి సాయంకాలపు నీరెండ పట్టణం మీదికి జల్లులా పడుతోంది.

భుజం మీది కండువా, ముతక ధోవతి, పడమటి దిశకు చేరుకున్న వయసు. ఆ పెద్దమనిషి పేరు సమ్మయ్య. చిన్నబోయిన మొహంతో అలా బస్‌స్టాప్‌లో నుంచున్నాడు.

ఆటోడ్రైవర్ యాదగిరి ఆ పెద్దమనిషి వంక చూశాడు. 'ఎక్కడో చూశాను' అనుకున్నాడు. వృత్తిరీత్యా ఎందరినో చూస్తుంటాడు. జ్ఞాపకం ఉండేవాళ్ళు కొందరు. జ్ఞాపకం పెట్టుకోవాల్సిన వాళ్ళు కొందరు. అలా గాలిలో ఆటోలోకి వచ్చిపోయే వాళ్ళు ఎందరో.

కాని ఈ పెద్దమనిషి మోహం తనకు బాగా గుర్తుంది. జ్ఞాపకాల్ని తవ్వుకోసాగాడు. యాదగిరి తలమీద ఒక్కచరువు చరచుకున్నాడు. పొద్దున ఆ పెద్దమనిషిని తన ఆటోలోనే బంజారా కొండలకు చేర్చాడు.

"బంజారాహిల్స్‌లో ఫలానా చోటికి పోవా"లని చెప్పాడు. ఆటోలో కూర్చోగానే.

తలూపాడు తను.

"జెర దగ్గరి దారిన తీసుకపో బాబూ! చుట్టూ తిప్పి తీసుకపోకు" అని వేడుకోలుగా అన్నాడు.

యాదగిరి చిన్న నవ్వు నవ్వి ఆటో స్టార్ట్ చేశాడు. అతను చెప్పిన చోట ఆటో ఆగింది.

దిగి ఆరు రూపాయలు చార్జీ చెల్లిస్తూ - "నిన్న ఇదే దూరానికి పది రూపాయలు ఇచ్చాను బాబూ" అని చెప్పాడు.

మాయలు, మర్మాలు యాదగిరికి తెలియక కాదు.కాని ఎన్నడూ వాటి జోలికి పోలేదు.

ఆ పెద్దమనిషిని మరోసారి చూశాడు. పొద్దుటి కంటే దిగులుగా కనిపిస్తున్నాడు. వచ్చిన పని కాలేదేమో!

యాదగిరికి జాలి అనిపించింది. ఏదైనా సాయం చేయాలి అనిపించింది. అతను చెప్పిన చోటికి ఉచితంగా ఆటోలో తీసుకపోవాలి అనిపించింది.

జీవితంలో ఎన్నో విషాదాల్ని చూశాడు. అందుకే దిగులుగా ఉన్న వాళ్ళు ఆత్మీయులుగా కనిపిస్తారు యాదగిరికి. దగ్గరగా వెళ్ళి మాట్లాడదామనుకున్నాడు.

అంతలో బస్సు వచ్చింది. ఆ పెద్దమనిషి బస్సెక్కి వెళ్ళిపోయాడు.

మరునాడు పొద్దున్నే మామూలు ప్రకారం ఒక బస్‌స్టాప్ దగ్గరలో ఆటో ఆపాడు యాదగిరి.

హడావుడిగా ఆ పెద్దమనిషి తనఖాళీ ఆటో వైపు రావడం కనిపించింది.

"తొందరగా వెళ్ళాలి బాబూ...!" అని నిన్న తీసుకుపోయిన చోటే చెప్పి ఆటోలో కూర్చున్నాడు.

ఆటో స్టార్ట్ అయింది. వేగంగా ముందుకు దూసుకుపోతుంది. అద్దంలో అతని దిగులు మొహాన్ని అడగాలా వద్దా అని కాసేపు తటపటాయించి -

"రెండు రోజుల్నుంచి అక్కడికి వెళ్తున్నారు. పని కాలేదాండీ!" అని అడిగాడు.

"ఊఁ!" ఉలిక్కిపడ్డాడు పెద్దమనిషి.

"నిన్న నా ఆటోలోనే వెళ్ళారు" అన్నాడు యాదగిరి.

"ఆఁ..." నిట్టూర్చాడు పెద్దమనిషి. "కాలేదు బాబూ.అసలు ఇంటర్వ్యూనే దొరకలేదు" అని చెప్పాడు.

"ఎవరితో ఇంటర్వ్యూ అండి?"

ఆ ప్రశ్నకు పెద్దమనిషి నొసలు చిట్లించుకోలేదు. వీడికెందుకు ఈ వివరాలన్నీ అని విసుక్కోలేదు. ఫలానా రాజకీయనాయకుడిని కలవడానికి ములుగు నుంచి వచ్చినట్లు

చెప్పాడు. తన పేరుసమ్మయ్య అనీ, ఫలానా విషయంలో ఆ రాజకీయ నాయకుణ్ణి కలవాలని కూడా చెప్పాడు.

"మీకు అయితే ఇంటర్వ్యూ దొరకాలా?" అని అడిగాడు యాదగిరి. ఆ విషయంలో తాను ఆ పెద్దమనిషికి తోడ్పడగలననే ధీమా ఉంది ఆ మాటల్లో.

తలూపాడు సమ్మయ్య.

"అయితే మిమ్మల్ని జగన్‌గారి దగ్గరికి తీసుకుపోతాను. ఆయన వస్తే అరనిముషంలో ఆ నాయకుడు ఇంటర్వ్యూ ఇస్తాడు" అని చెప్పాడు యాదగిరి.

సమ్మయ్య ఆశ్చర్యంగా చూశాడు. "ఈ జగన్ ఎవరు బాబూ, విద్యావేత్తనా?" అని అడిగాడు.

"అబ్బే కాదండి."

"పారిశ్రామికవేత్తనా?"

"ఉహూఁ... కాదండి" అని నవ్వాడు యాదగిరి.

"జగన్ గారు అయితే... ఫ్రీడం ఫైటరా?"

"కాదండి."

"కార్మిక నాయకుడా?"

"కాదండి"

"మీ ఆటో యూనియన్ లీడరా?"

"కాదండి"

"మరి అతనెవరు? అతనికి అరనిమిషంలో ఆ రాజకీయ నాయకుని ఇంటర్వ్యూ ఎలా దొరుకుతుంది?"

"అవునండి, తప్పక దొరుకుతుంది" అని దృఢంగా చెప్పాడు యాదగిరి.

"ఇంతకీ ఎవరు బాబూ జగన్‌గా రంటే?"

"జగన్‌గారు పట్నంలో పేరుమోసిన పెద్ద గూండా అండి" అని ఆటో దారి మళ్ళించాడు యాదగిరి.

*ఆంధ్రప్రభ వీక్లీ, 9-6-1989*